


జనగామ జిల్లా కొడకండ్లలో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి

## బీఆర్ఎస్ మ్యానిఫెస్టో దద్దరిల్లిపోతది

- కాంగ్రెస్‌ది కాపీ మ్యానిఫెస్టో
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

కొడకండ్ల, అక్టోబర్ 8: వచ్చే ఎన్నికల కోసం బీఆర్ఎస్ విడుదల చేసే మ్యానిఫెస్టోతో దేశం మార్మోగిపోతుందని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బీఆర్ఎస్ ఇచ్చిన వాటినే కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో కాపీ కొట్టిందని ఆరోపించారు. వరంగల్‌లో జరిగే భారీ బహిరంగ సభలో దేశం ఆశ్చర్యపోయేలా, ప్రతిపక్షాలకు నిద్ర లేకుండా చేసే మ్యానిఫెస్టోను సీఎం కేసీఆర్ ప్రకటిస్తారని చెప్పారు. ఆదివారం జనగామ జిల్లా కొడకండ్ల మండల కేంద్రంలో బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు దేశగాని సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో యువత పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించింది. అనంతరం నిర్వహించిన యూత్, సోషల్‌మీడియా సభలో మంత్రి ఎర్రబెల్లి మాట్లాడారు. యువతరం ద్వారానే రాజకీయం మరింత శక్తివంతం అవుతుందని అన్నారు. అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపిన సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి మరోసారి మద్దతుగా నిలవాలని కోరారు.



కరీంనగర్‌లోని 46వ డివిజన్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి గంగుల

## మరోసారి బీఆర్ఎస్‌ను ఆదరించాలి

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల

కరీంనగర్ కార్పొరేషన్, అక్టోబర్ 8 : భావితరాలకు మంచి భవిష్యత్ అందించేందుకు మరోసారి బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ పిలుపునిచ్చారు. మాయమాటలు చెప్పే బీజేపీ, కాంగ్రెస్‌కు అధికారం అప్పగిస్తే అభివృద్ధి కుంటుపడి, బిడ్డల భవిష్యత్ అంధకారం అవుతుందని తెలిపారు. ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో మేయర్ యాదగిరి సునీల్‌రావుతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఆయా డివిజన్లలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనలో అన్ని కులమతాల ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ మతాల పేరుతో చిచ్చు రేపే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు కేవలం ఎన్నికల సమయంలోనే కనిపిస్తారని, ఓట్లు వేసుకొని మొహం చాటేస్తారని విమర్శించారు. తాము ఎన్నికలతో సంబంధం లేకుండా ప్రజల మధ్యలోనే ఉంటామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.వేల కోట్లు తెచ్చి నగరాన్ని అన్ని రంగాల్లో గొప్పగా అభివృద్ధి చేసినట్టు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మరోమారు బీఆర్ఎస్‌ను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# అబద్ధాలు ఆడేవారిని నమ్మొద్దు

- కేసీఆర్ సహకారంతోనే పుష్కలంగా నిధులు
- సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి

నస్రుల్లాబాద్/కామారెడ్డి/బాన్సువాడ, అక్టోబర్ 8: కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఓట్ల కోసం అబద్ధాలు ఆడుతున్నారని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఆ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ సంక్షేమ పథకాలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. స్వరాష్ట్రంలోనే గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ సహకారంతో గ్రామాలకు పెద్దమొత్తం నిధులు వస్తున్నాయని తెలిపారు. ఆదివారం ఆయన కామారెడ్డి జిల్లా కేంద్రంతోపాటు నస్రుల్లాబాద్, బీర్కూర్ మండలాల్లో పర్యటించి పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. బీర్కూర్ మండలంలో బరంగేడ్గిలో రూ.28 లక్షలతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల అదనపు గదులను ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని బైపాస్ రహదారి పక్కన బంజారా భవన్ నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో స్పీకర్ మాట్లాడుతూ.. సమైక్యపాలనలో గ్రామాల అభివృద్ధి కోసం అరకొర నిధులు వచ్చేవని, నేడు ఒక్కో గ్రామానికి ఏడాదికి కోట్లు వస్తున్నట్టు తెలిపారు. బాన్సువాడ ప్రాంత రైతాంగం దేశానికి అన్నంపెట్టే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. వచ్చే ఎన్నికల్లో తనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు.



నస్రుల్లాబాద్ మండలం మిర్జాపూర్‌లో పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం

### • బీసీలకు లక్ష సాయం చెక్కులు




ఆదివారం మహబూబ్‌నగర్‌లోని శిల్పారామంలో 200 మంది లబ్ధిదారులకు బీసీ చేయూత కింద రూ.లక్ష చొప్పున మంజూరైన చెక్కులను ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులవృత్తులు చేపట్టే వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకే సీఎం కేసీఆర్ బీసీ చేయూత పథకానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. – మహబూబ్‌నగర్ అర్బన్

## మైనారిటీల సంక్షేమానికి సర్కార్ పెద్దపీట

- ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి కొప్పుల

ధర్మపురి, అక్టోబర్ 8: రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేసిందని, స్వరాష్ట్రంలో అనేక పథకాలతో చేయూతనిచ్చిందని ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఆదివారం జగిత్యాల జిల్లా ధర్మపురిలో 120 మంది మైనార్టీలకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున రూ.1.20 కోట్ల విలువైన ఆర్థిక సాయం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మైనార్టీల అభ్యున్నతి కోసమే సీఎం కేసీఆర్ రూ.లక్ష సాయం ప్రకటించినట్టు చెప్పారు.



ధర్మపురిలో మైనార్టీలకు రూ.లక్ష సాయం చెక్కును అందజేస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్



సిరిసిల్ల కలెక్టర్‌లో మైనార్టీ బంధు లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న వినోద్‌కుమార్. చిత్రంలో జడ్పీ చైర్‌పర్సన్ అరుణ, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి తదితరులు

## అభివృద్ధిలో తెలంగాణ దేశానికే దిక్సూచి

- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్
- రాజన్నసిరిసిల్ల జిల్లాలో అభివృద్ధి పనులు ప్రారంభం

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 8 (నమస్తే తెలంగాణ): అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ దేశానికే దిక్సూచిగా నిలుస్తున్నదని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మైనార్టీ పిల్లలకు మెరుగైన విద్యనందించేందుకు గురుకులాలను ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని చెప్పారు. ఆదివారం ఆయన రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, సిరిసిల్లలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. సిరిసిల్ల కలెక్టరేట్ ఆవరణలో 120 మంది మైనార్టీలకు రూ. లక్ష సాయం చెక్కులను పంపిణీ చేశారు. 425 మంది మహిళలకు కుట్టు మెషిన్లు అందజేశారు. అనంతరం వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యమిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ తదితరులు పాల్గొన్నారు.



వెంగ్వాపేట్‌లో చెక్‌డ్యాం పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

## కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాల్లో పెన్షన్ ఆరొందలే

- బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనూ అంతే..
- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

సోన్, అక్టోబర్ 8 : కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వృద్ధులు, వికలాంగులకు పింఛన్ కేవలం రూ.600లే ఇస్తున్నారని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. తెలంగాణ సరిహద్దులోని అప్పారావుపేట్, కివి గ్రామాల్లోని వారికి కూడా రూ.600లే వస్తున్నట్టు చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఇక్కడికొచ్చి పెద్ద పెద్ద మాటలు చెబుతున్నారని, వారి గాలి మాటలు నమ్మితే మోసపోతామని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలో రూ.200 ఉన్న పెన్షన్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ వచ్చాక రూ.2,016కు పెంచుకోవడం జరిగిందని తెలిపారు. ఆదివారం నిర్మల్ జిల్లా సోన్ మండలం వెంగ్వాపేట్ గ్రామంలో రూ.7.15 కోట్లతో నిర్మించనున్న చెక్‌డ్యాం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వెంగ్వాపేట్ గ్రామస్థుల చిరకాల కోరిక ఈ చెక్‌డ్యాం అని, ఇది పూర్తయితే మూడు కిలోమీటర్ల మేర నీరు నిల్వ ఉండటంతో పాటు 300 ఎకరాల ఆయకట్టుకు నీరందుతుందని తెలిపారు.

## ఇంటర్నెట్ బ్యాన్‌పై నిరసనలు

- మణిపూర్‌లో ఎన్‌హెచ్-2ను దిగ్బంధించిన విద్యార్థులు
- మంత్రి ఇంటిపై గ్రనేడ్ దాడి
- సీఆర్‌పీఎఫ్ జవాన్‌కు గాయాలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: మణిపూర్‌లో ఇంటర్నెట్‌పై నిషేధానికి వ్యతిరేకంగా ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. రాష్ట్రవ్యాప్తంగా 150కిపైగా ట్రక్కుల్ని ఆందోళనకారులు నిలిపివేశారని, కొన్నింటిపై దాడులు చేసినట్టు వార్తలు వెలువడ్డాయి. ఈ ఏడాది మే నుంచి రాష్ట్రంలో ఇంటర్నెట్‌ను బీజేపీ ప్రభుత్వం నిలిపివేసింది. దీనికి నిరసనగా సేనాపతి స్టూడెంట్స్ అసోసియేషన్ ఆందోళనకు పిలుపునిచ్చింది. శుక్రవారం కల్లా ఇంటర్నెట్ బ్యాన్ ఎత్తేయాలని, లేదంటే ఆందోళనల్ని మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వానికి అల్టిమేటం జారీచేసింది. ఆందోళనకారులు శనివారం ఎన్‌హెచ్-2ని దిగ్బంధించారు. 'ఇంటర్నెట్ సేవలు పొందటం ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు. శాంతిభద్రతల సమస్యలేని చోటా నిషేధం విధించారు' అని స్టూడెంట్స్ అసోసియేషన్ తెలిపింది. పశ్చిమ ఇంఫాల్ జిల్లాలో రాష్ట్రమంత్రి ఖేమ్‌చంద్ నివాసంపై గుర్తు తెలియని వ్యక్తులు గ్రనేడ్ దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఇద్దరు వ్యక్తులు, ఒక సీఆర్‌పీఎఫ్ జవాన్‌కు గాయాలయ్యాయి. శనివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుందని, మోటార్ సైకిల్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు గ్రనేడ్ విసిరారని పోలీసులు తెలిపారు.



దాదాపు ఏడు దశాబ్దాల తర్వాత భారత వైమానిక దళం (ఐఏఎఫ్) కోసం నూతన పతాకాన్ని రూపొందించారు. ఎయిర్ ఫోర్స్ డే పరేడ్ సందర్భంగా ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్, ఎయిర్ చీఫ్ మార్షల్ వీఆర్ చౌదరి ఆదివారం దీనిని ఆవిష్కరించారు. వైమానిక దళ విలువను మరింత ప్రతిబింబించేందుకు ఈ నూతన పతాకాన్ని తయారు చేసినట్టు రక్షణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

## కార్మికుడి బ్యాంక్ ఖాతాలో రూ.753 కోట్లు

**తమిళ నాడులో మరో ఘటన**

చెన్నై, అక్టోబర్ 8: ఇటీవల తమిళనాడులో కొందరు సామాన్యుల బ్యాంక్ ఖాతాల్లో హఠాత్తుగా వందల కోట్ల రూపాయలు జమ అవుతూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి. తాజాగా ఫార్మసీ కార్మికుడిగా పనిచేస్తున్న మరో వ్యక్తి ఖాతాలో శనివారం ఏకంగా రూ.753 కోట్లు కన్పించడంతో అతను షాక్ తిన్నాడు. మహమ్మద్ ఇద్రీస్ అనే కార్మికుడు శుక్రవారం తన బ్యాంకు ఖాతా నుంచి మిత్రుడికి రూ.2 వేలు పంపాడు. తర్వాత బ్యాలెన్స్ పరిశీలించగా రూ.753 కోట్లు చూపెట్టింది. దీంతో విషయాన్ని వెంటనే బ్యాంక్ అధికారులకు చెప్పడంతో ఖాతాను స్తంభింపచేశారు.

## తృణమూల్ మంత్రి, ఎమ్మెల్యే ఇండ్లపై సీబీఐ దాడులు

కోల్‌కతా, అక్టోబర్ 8: పశ్చిమ బెంగాల్ మంత్రి ఫిర్హాద్ హకీం, తృణమూల్ ఎమ్మెల్యే మదన్ మిత్రా నివాసాలపై సీబీఐ ఆదివారం దాడులు చేపట్టింది. స్థానిక సంస్థల్లో ఉద్యోగ నియామకాల్లో అక్రమాల ఆరోపణలపై సోదాలు నిర్వహించినట్టు అధికారులు తెలిపారు. తృణమూల్ నాయకులు సుదామ రాయ్, అంగుశ్మాన్ రాయ్, అషిం ఘోష్ ఇండ్లు, ఇతర స్థావరాల్లోనూ సోదాలు జరిపినట్టు సీబీఐ ప్రకటించింది.

## లడఖ్ ఎన్నికల్లో బీజేపీకి పరాభవం

లడఖ్, అక్టోబర్ 8: స్వయం ప్రతిపత్తి కలిగిన కార్గిల్‌లోని లడఖ్ హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఎన్నికల్లో బీజేపీని కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీల కూటమి మట్టి కరిపించింది.మొత్తం 30 సభ్యులలో నలుగురిని నామినేట్ చేయగా మిగిలిన 26 సీట్లకు అక్టోబర్ 4న ఎన్నికలు జరిగాయి. ఆదివారం ప్రకటించిన ఫలితాలలో 12 సీట్లతో నేషనల్ కాన్ఫరెన్స్ అతిపెద్ద పార్టీగా అవతరించింది. కాంగ్రెస్ 10 స్థానాలు గెల్చుకోగా, బీజేపీ రెండింటితో సరిపెట్టుకుంది. రెండింటిలో స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు.

# ఎక్కడ చూసినా శవాల కుప్పలే

- రెండు దశాబ్దాలుగా ఎన్నడూ చూడని ఘోరం
- అఫ్గాన్‌లో 2 వేలు దాటిన మృతుల సంఖ్య
- వందలాది గృహాలు ధ్వంసం
- శిథిలాల కింద చిక్కుకున్న వందలాది మంది

ఇస్లామాబాద్, అక్టోబర్ 8: అఫ్గానిస్థాన్‌లో శనివారం సంభవించిన భారీ భూకంప మృతుల సంఖ్య రెండు వేలు దాటింది. దేశంలో ఎక్కడ చేసినా శవాల కుప్పలే కన్పిస్తున్నాయి. ఏ శిథిలాన్ని తొలగిస్తే ఎన్ని శవాలు బయటపడతాయోనని సహాయ బృందాలు భయపడుతున్నాయి. మృతుల సంఖ్య రెండు వేలు దాటినట్టు తాలిబన్ ప్రభుత్వ ప్రతినిధి అబ్దుల్ వాహిద్ రేయన్ ఆదివారం వెల్లడించారు. అయితే మృతుల సంఖ్య దీనికన్నా ఎక్కువే ఉండవచ్చునని అభిప్రాయపడ్డారు. గత రెండు దశాబ్దాలుగా అఫ్గాన్‌లో ఎన్నడూ ఇంత తీవ్ర భూకంపాన్ని చూడలేదని ఆయన వ్యాఖ్యానించారు. భూకంపానికి పలు గ్రామాలు నాశనమయ్యాయని, వందలాది మంది ప్రజలు శిథిలాల కింద సజీవ సమాధి అయ్యారని, సహాయ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. అధికారికంగా 2060 మంది మృతి చెందినట్టు తేలిందని, 1240 మంది గాయపడ్డారని, 1320 గృహాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయని చెప్పారు. సుమారు డజన్ సహాయ బృందాలతో పాటు, మిలటరీ, రెడ్ క్రీసెంట్ లాంటి ఎన్జీవోలు సహాయ కార్యక్రమాల్లో నిమగ్నమై ఉన్నాయని చెప్పారు.

**చేతులతో మృతదేహాలను వెలికితీస్తున్న పౌరులు**

6.3 తీవ్రతతో శనివారం పశ్చిమ అఫ్గాన్‌లోని హెరాత్‌లో సంభవించిన భారీ భూకంపానికి భవనాలు పేకమేడల్లా కూలాయి. ఐదుసార్లు భూ ప్రకంపనలు రాగా, అందులో 6.3, 5.9, 5.5 తీవ్రతతో వచ్చిన భూకంపం తీవ్ర నష్టం కలిగించింది. ప్రకంపనల ధాటికి పలుచోట్ల కొండచరియలు విరిగి పడ్డాయి. కార్యాలయాలు, ఇళ్లలో ఉన్న పౌరులు భయంతో బయటకు పరుగులు తీశారు. పలువురు ఏం జరుగుతుందో తెలుసుకునేలోగా ప్రాణాలు కోల్పోయారు. పలు చోట్ల భవనాల శిథిలాల కింద చాలామంది చిక్కుకుపోవడంతో సహాయ బృందాలు రక్షణ చర్యలు చేపట్టాయి. హెరాత్ నగరంలో శిథిలాలు, రాళ్ల కింద ఉన్న మృతదేహాలను, గాయపడిన వారిని పౌరులే తమ చేతులతో బయటకు తీస్తున్న దృశ్యాలు కన్పించాయి. కూలిన భవనంలో చెత్త మధ్య పీకలోతులో కూరుకుపోయి ఉన్న ఒక చిన్నారి బాలికను కొందరు స్థానికులు రక్షించారు. అదే సమయంలో వారికి ఒక చేయి కన్పించింది. ఆ చేయి ఆ బాలిక తల్లిదిగా భావిస్తున్నారు. అయితే ఆమె బతికున్నదీ లేనిదీ ఇంకా తెలియలేదు. వీటికి సంబంధించిన దృశ్యాలు వైరల్‌గా మారాయి.



అఫ్గానిస్థాన్‌లోని ఓ ప్రాంతంలో భూకంపం ధాటికి కుప్పకూలిన భవనం శిథిలాల కింద తమవారిని వెతుక్కుంటున్న కుటుంబ సభ్యులు

## 'మోనోక్రోటోఫాస్'పై కేంద్రం నిషేధం

- మరో 3 పురుగు మందులపైనా..
- సుప్రీంకోర్టులో విచారణకు రానున్న నేపథ్యంలో నిర్ణయం



న్యూఢిల్లీ, అక్టోబర్ 8: కొద్ది రోజుల్లో సుప్రీంకోర్టులో కీలక విచారణ జరుగనున్న నేపథ్యంలో నిషేధిత ప్రాథమిక జాబితా(27)లోని నాలుగు క్రిమి సంహారక మందుల వినియోగాన్ని నిషేధిస్తూ కేంద్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకొన్నది. వీటిలో 'మోనోక్రొటోఫస్' పురుగుల మందుతోపాటు డికోఫోల్, డినోక్యాప్, మిథోమైల్ ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న స్టాక్‌ను క్లియర్ చేసుకొనేందుకు నిల్వల గడువు కాలం ముగిసే వరకు మాత్రమే 'మోనోక్రొటోఫాస్ 36% ఎస్ఎల్' అమ్మకాలు, పంపిణీ, వినియోగానికి అనుమతి ఉంటుందని ఉత్తర్వు పేర్కొన్నది. అయితే దీనిపై పెస్టిసైడ్ యాక్షన్ నెట్‌వర్క్(పీఏఎన్) అభ్యంతరం వ్యక్తం చేసింది. స్టాక్ అయిపోయేంత వరకు మోనోక్రొటోఫాస్‌ను దీర్ఘకాలం వినియోగించేందుకు ఇది అవకాశం కల్పిస్తుందని పేర్కొన్నది. అన్ని మోనోక్రొటోఫాస్ ఫార్ములేషన్ల తయారీని నిషేధించేలా ప్రత్యేక ఆదేశాలు ఇవ్వాల్సిన అవసరాన్ని పీఏఎన్ నొక్కిచెప్పింది. 27 క్రిమి సంహారక మందుల్లో కేవలం మూడింటిపైనే నిషేధం కొనసాగించాలని, మిగతా వాటిని మినహాయించాలని పేర్కొంటూ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రిసెర్చ్(ఐసీఏఆర్) మాజీ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ టీపీ రాజేంద్రన్ కమిటీ సూచించింది. ఈ మేరకు వాటిని మినహాయిస్తూ కేంద్రం ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్ణయం తీసుకొన్నది. దీన్ని వ్యతిరేకిస్తూ పలు పౌర సంఘాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి.



పశ్చిమబెంగాల్‌లోని తీస్తా బజార్‌లో ఇంట్లోకి చేరిన బురదను తొలగిస్తున్న బాధితులు

## ఇంకా దొరకని 14 మంది జవాన్ల ఆచూకీ

**కొనసాగుతున్న సహాయక చర్యలు**

గ్యాంగ్‌టక్, అక్టోబర్ 8: సిక్కింలో ఇటీవల ఆకస్మికంగా సంభవించిన వరదల నుంచి ప్రజలు ఇంకా తేరుకోలేదు. ఆ రాష్ట్రంలో ఇంకా వరద సహాయ చర్యలు, గల్లంతైన వారి కోసం గాలింపు కొనసాగుతూనే ఉంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సిక్కింలోని మంగన్ జిల్లా లాచెన్, లాచంగ్ లోయలోకి వచ్చిన మూడు వేల మంది పర్యాటకులు వరదల్లో చిక్కుకుపోయారు. తొలుత వారు కూడా గల్లంతయ్యారని భావించారు. అయితే వారంతా క్షేమంగానే ఉన్నట్టు అధికారులు ప్రకటించారు. వీరిని హెలికాప్టర్ ద్వారా తరలించడానికి ప్రయత్నించినా, వాతావరణం అనుకూలించ లేదు. కాగా, సిక్కిం వరదల్లో 55 మంది మరణించగా, అందులో 8 మంది ఆర్మీ సిబ్బంది ఉన్నారు. ఇంకా 14 మంది జవాన్ల ఆచూకీ తెలియాల్సి ఉంది. 140 మంది వరదల్లో గల్లంతయ్యారు. వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

### రాజస్థాన్‌లో మరో నీట్ విద్యార్థి ఆత్మహత్య

జైపూర్, అక్టోబర్ 8: నీట్ పరీక్షకు సిద్ధమవుతున్న ఒక విద్యార్థి రాజస్థాన్‌లోని సికర్ జిల్లాలో ఆత్మహత్య చేసుకున్నాడు. భరత్‌పూర్ జిల్లా నాద్‌బాయ్‌కు చెందిన నితిన్ ఫౌజ్‌దార్ నీట్ పరీక్షలో శిక్షణ తీసుకోవడానికి జూన్‌లో సికర్‌కు వచ్చాడు. శనివారం ఇన్‌స్టిట్యూట్‌కు వెళ్లని నితిన్ రూములోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మూడు రోజుల వ్యవధిలో సికర్‌లో ఇది రెండో ఆత్మహత్య. కోచింగ్ హబ్ కోటాలో ఈ ఏడాది ఇంతవరకు 23 విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నట్టు అధికారులు తెలిపారు.

### బీహార్‌లో నీట మునిగి 22 మంది మృతి

పాట్నా, అక్టోబర్ 8: బీహార్‌లోని వివిధ జిల్లాల్లో వేర్వేరు ప్రమాదాల్లో నీట మునిగి 22 మంది మృతి చెందారు. జీవిత్‌పుత్రిక పండుగతో పాటు ఇతర ఘటనల్లో నదులు, చెరువుల్లో స్నానాలు చేస్తూ మునిగి 22 మంది మరణించారని అధికారులు తెలిపారు. భోజ్‌పూర్‌లో ఐదుగురు, జెహన్‌బాద్‌లో నలుగురు, పాట్నా, రోహ్‌తాస్‌లో ముగ్గురు చొప్పున మృతి చెందారు. భోజ్‌పూర్ జిల్లాలో జరిగిన ఘటనలో ఒక బాలిక సెల్ఫీ తీసుకోవడానికి ప్రయత్నిస్తూ నీటిలో కొట్టుకుపోగా, ఆమెను రక్షించబోయి నలుగురు బాలికలు మృతిచెందారు.

### ఆరు నెలల్లో క్యాన్సర్ మాయం

- కొత్త ఔషధంతో బతికి బయటపడ్డ బ్రిటన్ మహిళ

లండన్: క్లినికల్ ట్రయల్స్‌లో వైద్యులు ఓ క్యాన్సర్ రోగికి ఇచ్చిన సరికొత్త ఔషధం అద్భుతం సృష్టించింది. బ్రిటన్‌కు చెందిన ఓ 42 ఏండ్ల మహిళను క్యాన్సర్‌బారి నుంచి బయటపడేసింది. 'డోస్టర్‌లిమాబ్' అనే కొత్త డ్రగ్‌ను ఆరు నెలలు వాడగా.. స్టేజ్-3 క్యాన్సర్ కనుమరుగయ్యాయి. క్యాన్సర్ చికిత్సలో దీనిని ఓ మిరాకిల్ డ్రగ్‌గా వారు పేర్కొన్నారు. 'రేడియోథెరపీ, సర్జరీ, కీమోథెరపీ లేకుండా చికిత్స అందించాం. 'డోస్టర్‌లిమాబ్' క్యాన్సర్ కణాలపై అద్భుతంగా పనిచేసింది' అని స్వాన్సీ బే యూనివర్సిటీ హెల్త్ బోర్డ్ తెలిపింది. రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేసే ఇమ్యునోథెరపీ డ్రగ్ ఇది. గత ఏడాది ఈ ఔషధాన్ని వాడిన 18 మంది క్యాన్సర్ నుంచి పూర్తిగా బయటపడ్డారని వైద్య పరీక్షల్లో తేలింది.